సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం। 17 । జూన్ । 2025



వివాహిత అనుమానాస్పద మృతి

సోంపేట మండలం పాలవలసకు చెందిన వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. - 8లో



ఉచిత శిక్షణ..

మహిళలకు ఉపాధినిచ్చేలా ఎచ్చెర్ల మహిళా ప్రాంగణంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ జరుగుతోంది. - 8లో

యోగా విధుల్లో జిల్లా అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖపట్నంలో ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ నెల 21న జరగనున్న యోగా కార్యక్రమానికి జిల్లా నుంచి పలువురు అధికారులకు డిప్యూటేషన్ వేశారు. వీరంతా కార్యక్రమం పూర్తయ్యే వరకు విశాఖపట్నంలో ఉంటారు. మరోవైపు, వారం రోజులు పాటు జిల్లాలో అన్ని మండలాల తహసీల్దార్లు యోగా విధుల్లోనే ఉంటారు. ఒకేసారి 34 మంది తహసీల్దార్లను యోగా విధులకు వినియోగించడంతో రైతులు, ఇతర వర్గాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

జీడి కార్మికుల పొట్టకొట్టొద్దు



పలాసలో నిరసన తెలుపుతున్న జీడి కార్మికులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రెండు వారాలుగా మూతబడిన జీడి పరిశ్రమలు వెంటనే తెరవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాష్యూ లేబర్, రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో పలాస కాష్యూ అసోసియేషన్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ రెండు వారాలుగా కార్మికులకు ఉపాధి లేక రుణాలు, డ్వాక్రా వాయిదాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కలాసీలు, పిక్కలు ఒలిచేవారు, బాయిలింగ్ తదితర కార్మికులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కష్టంతో పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ప్రభుత్వ రాయితీలు పొంది నేడు కార్మికులకు ఆకలితో ఉంచడం సమంజసం కాదన్నారు. పరిశ్రమలు తెరవకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో సంఘ కార్యదర్శి సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, బొంపల్లి సింహాచలం, కోనారి భీమారావు, జోగి మోహనరావు పాల్గొన్నారు.

విచారణలో గోప్యమెందుకో?



వైఎస్సార్ సీపీ నాయకులను బయటకు పంపించేస్తున్న ఏపీడీ

ఆమదాలవలస: రామచంద్రపురం పంచాయతీ పొన్నాంపేటలో ఉపాధి హామీ పనుల నిర్వహణ, అక్రమాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. ముందుగా రామాలయం బయట బహిరంగంగా విచారణ నిర్వహించగా ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేతనదారులు ఫిర్యాదులు గుప్పించారు. దీంతో పూర్తి అక్రమాలు బయటపడతాయనో.. మరో కారణమో తెలియదు గానీ ఏపీడీ లోకేష్, ఇతర అధికారులు రామాలయం లోపలికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ లోపలికి వెళ్లగా సదరు అధికారి కేకలు వేస్తూ బయటకు వెళ్లిపోవాలని చెప్పడం చర్చనీయాంశమైంది. కాగా, గ్రామానికి చెందిన జి.ఎర్రంనాయుడు, హేమలత దంపతులకు రెండు జాబుకార్డులు ఉండటం, అదే గ్రామానికి చెందిన జి.రామారావు కో ఆపరేటివ్ ఉద్యోగిగా పనిచేస్తున్నా అతనికి భార్య ఎర్రమ్మ పేరిట మస్తర్లు వేయడం తదితర అంశాలపై గ్రామానికి చెందిన ఇప్పిలి రామచంద్రరావు, మరికొందరు ఇటీవల కలెక్టర్ ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఫీల్డ్ అసిస్టెంట్ సరస్వతి మాట్లాడుతూ తనకు ఆరోగ్యం సరిగా లేని కారణంగా కొన్ని రోజులపాటు ఎర్రంనాయుడుతో మస్తర్లు వేయించానని, ఆ సమయంలో తప్పులు జరిగి ఉండవచ్చని చెప్పారు. సామాజిక ఆడిట్ సమయంలో ఆ మొత్తాలను చెల్లిస్తానని అంగీకరించారు. ఈ విషయమై ఏపీడీ మాట్లాడుతూ ఒక కుటుంబంలో రెండు జాబు కార్డులు ఉంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనరసమ్మ, ఈసీ రాము, టెక్నికల్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

'కూర్మ' ఘటన దర్యాప్తు వేగవంతానికి కృషి

హిరమండలం: కూర్మ గ్రామంలో అగ్నిప్రమాదానికి సంబంధించి దర్యాప్తు వేగవంతం చేసేందుకు కృషిచేస్తానని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ అన్నారు. సోమవారం కూర్మ గ్రామాన్ని సందర్శించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.పర్ణశాల పునఃనిర్మాణానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గేదల చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చేదే విత్తు.. రైతన్న చిత్తు



- రైతులకు అవసరమైన విత్తన రకాలు అందించని ప్రభుత్వం
- కావల్సిన విత్తనాలు ప్రైవేటునే కొనుగోలు చేసుకోవాల్సిందే
- విత్తన కేటాయింపుల్లోనూ జిల్లాకు మొండిచేయి
- నాణ్యత పరీక్షలను గాలికొది లేసిన వైనం
- వ్యవసాయ శాఖ మంత్రి సొంత జిల్లాలో దుస్థితి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాకు చెందిన అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నందున ఈసారి శ్రీకాకుళం జిల్లాకు భారీగా విత్తన కేటాయింపులు జరుగుతాయని, అనువైన వంగడాలు అందజేస్తారని రైతులు ఆశపడ్డారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో అరకొరగా కేటాయింపులతో పాటు రైతులు కోరినవి కాకుండా పాత వంగడాలనే ధరలు పెంచేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. వాస్తవానికి, గత ఏడాది ఎగుమతులు ఆగిపోవటం, సన్నాలకు మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వల్ల దుడ్డురకం(ఎఫ్‌సీ వెరైటీస్) వరి విత్తనాలపైనే ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. అధిక దిగుబడులను అందించే రీసెర్చ్ వెరైటీలను రాయితీపై అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు.

రకం/25 కిలోల బస్తా.	గతేడాది	ప్రస్తుత ధర
బీపీటీ5204(సాంబమసూరి)	795	825
ఎంటీయూ1121(శ్రీధృతి)	745	800
ఆర్‌జీఎల్2537(శ్రీకాకుళం సన్నాలు)	795	825
ఎంటీయూ7029(స్వర్ణ)	745	800
ఎంటీయూ1061(ఇంద్ర)	745	800
ఎంటీయూ1064(అమర)	745	800
ఎంటీయూ1224(మార్టేర్ సాంబ)	795	800

ప్రైవేటే దిక్కు..

రీసెర్చ్ వంగడాలు ప్రైవేట్‌కు మాత్రమే పేటెంట్‌లుగా మారిపోయాయి. ప్రభుత్వం వాటిని సమకూర్చకపోవడంతో సంపద, అమూల్య, సూపర్‌స్వరాజ్, అజయ్, రాణి, సుభద్ర, నంద వంటి అనేక బ్రాండ్‌లతో మార్కెట్‌లో దొరుకుతున్న రీసెర్చ్ వెరైటీలు కిలో రూ.70 నుంచి రూ.80 వరకు వెచ్చించి రైతులు ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తుంది. వాస్తవంగా రీసెర్చ్ విత్తనాలపై కంపెనీలతో ప్రభుత్వం ముందస్తు ఒప్పందం చేసుకోవాలి. ఆమేరకు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధం చేయాలి. ఖర్చుతో కూడకున్నదని రీసెర్చ్ వంగడాలవైపు వెళ్లలేదు. పాత వంగడాలతోనే సరిపెడుతోంది.

పాత వంగడాల ధరలు పెంపు

వ్యవసాయశాఖ ఏపీసీడ్స్ ద్వారా అందిస్తున్న రెగ్యులర్ వరివిత్తనాల ధరలు పెరగటంతో రైతులకు అదనపు భారంగా మారింది. వాస్తవంగా గతేడాది ధాన్యం కొనుగోళ్లు సరిగా జరగలేదు. లక్షల కుట్రలు, కొనుగోలు మాయాజాలం కారణంగా అనేక చోట్ల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. తప్పని పరిస్థితుల్లో దాదాపు ప్రైవేటున విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మద్దతు ధరతో కొనుగోలు చేయని ప్రభుత్వం ఇక్కడే తయారై, ఇక్కడే పంపిణీ అవుతున్న పాత వంగడాలపై ధరలు పెంచడమేంటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంపిణీ సమయంలో విత్తన శుద్ధి ప్యాకెట్ సుడోమోనాస్ కింద అదనంగా రూ.20 నుంచి రూ.40 వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగని విత్తనశుద్ధి ప్యాకెట్లు కూడా అందజేయడం లేదని రైతులు అంటున్నారు.

అరకొర కేటాయింపులు..

సాక్షాత్తు మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలో విత్తనాల కేటాయింపులు అరకొరగా జరిగాయి. పొరుగునున్న విజయనగరం జిల్లా కంటే శ్రీకాకుళం జిల్లాలో తక్కువగా విత్తన కేటాయింపులు జరగడం గమనార్హం. విజయనగరం జిల్లాలో 91వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి 50వేల క్వింటాళ్ల విత్తనాలు కేటాయించగా, మన జిల్లాలో లక్షా 50వేల 709హెక్టార్లకు గాను 38,499 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. గతం కన్నా తక్కువ కేటాయింపులు జరగడం గమనార్హం. దీన్నిబట్టి సొంత జిల్లా రైతులపై అచ్చెన్నాయుడు ఎంత ప్రేమ చూపించారో అర్థం చేసుకోవచ్చు.

రీసెర్చ్ వంగడాలు అందించాలి



రైతులకు అవసరమైన, అధిక దిగుబడులు అందించే రీసెర్చ్ వంగడాలను ప్రభుత్వం రాయితీపై అందించాలి. ఎప్పుడూ పాత వంగడాలే అందిస్తుండటంతో దిగుబడులు తక్కువగా వస్తున్నాయి. పెట్టుబడులు పెరగడంతో పాటు చీడపీడల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. – కణుగుల సత్యం, రైతు, వెదుళ్లవలస, పోలాకి మండలం

నాణ్యత పరీక్షలపై నీలినీడలు



గతంలో అనేకసార్లు సబ్సిడీపై అందించిన విత్తనాలు మొలక శాతంలో తేడాలు రావటంతో రైతులకు రాయితీ విత్తనాలపై నమ్మకం సన్నగిల్లింది. ఈ ఏడాది వ్యవసాయశాఖలో అధికారులు, సిబ్బంది బదిలీలు నేపథ్యంలో ఎక్కడా నాణ్యత పరీక్షలు చేసిన దాఖలాలు లేవు. మండలాల వారీగా టార్గెట్ పెట్టి నాణ్యత పరీక్షలు చేయాలి. ప్రైవేటు దుకాణాల్లో కూడా పరీక్షలు చేయాలి. కానీ ఆ స్థాయిలో నాణ్యతా పరీక్షలు జరగలేదని తెలుస్తోంది. ముఖ్యంగా రైతుసేవాకేంద్రాల్లో పంపిణీ చేస్తున్న విత్తనాలను స్థానికంగా శాంపిల్స్ తీసి వాటి నాణ్యతను నిరూపించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఇప్పుడా పని జరగకపోవడంతో విత్తనాలపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. దీనివల్ల విత్తనం నాటిన తర్వాత చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నష్టపరిహారం డిమాండ్ చేయటం, మళ్లీ విత్తనాల కోసం ప్రైవేటు దుకాణాల వద్ద క్యూకట్టడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. నష్టపోయాక హడావుడి నాణ్యతపరీక్షలు జరిపి కాకిలెక్కలు చెప్పడం కన్నా ముందే విత్తన నాణ్యత పరీక్షలు చేయాల్సి అవసరం ఉంది.

రైతులపై ధరాభారం



గత ఏడాది పండించిన ధాన్యం ఇంకా రైతుల ఇళ్లల్లోనే ఉన్నాయి. కనీస మద్దతు ధరకు కూడా కొనుగోలు చేయటం లేదు. అలాంటిది విత్తనం వరకు వచ్చేసరికి ఎందుకో ఇంత ధరలు పలుకుతున్నాయి. రైతులకు ఇది భారం కాదా? సబ్సిడీ పెంచాల్సింది పోయి ధరలు పెంచడం ఆశ్చర్యంగా ఉంది. – బంకా చక్రధర్, సర్పంచ్, గంగివలస, పోలాకి మండలం

కదంబ పుష్పార్చన



జిల్లా కేంద్రంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయం వద్ద స్వామివారికి సోమవారం కదంబ పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. – శ్రీకాకుళం కల్చరల్

డాబాపై డ్రాగన్ ఫ్రూట్




జిల్లా కేంద్రంలోని దండివీధిలో నివాసముంటున్న ప్రసాద్ తన డాబాపై డ్రాగన్ ఫ్రూట్ పండించారు. కొన్నాళ్లుగా మొక్కను శ్రద్ధగా పెంచడం వల్ల ఎట్టకేలకు ఫలితం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. – శ్రీకాకుళం కల్చరల్

పులి కాదు పునుగు పిల్లి



టెక్కలి మండలం జయకృష్ణాపురం గ్రామ సమీప పొలాల్లో సోమవారం వింత జంతువు సంచరించింది. చిరుత పులి పిల్లను పోలి ఉండటంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై అటవీ శాఖాధికారులు స్పందిస్తూ చిరుత పులిని పోలి ఉండే ఈ జంతువును నీటి పిల్లి, పునుగు పిలి, ఫిస్సింగ్ క్యాట్‌గా పిలుస్తుంటారని చెప్పారు. దీని వల్ల ఎటువంటి ప్రమాదం ఉండదని, చేపల వేట కోసం చెరువులు వద్దకు వస్తుంటాయని తెలిపారు. ఇలాంటి జీవులకు ఎటువంటి హాని కలిగించవద్దని కోరారు. – టెక్కలి రూరల్

ఒకే ఒక్కడు!



కూటమి సర్కారు తీసుకున్న చర్యలతో సచివాలయాలు నిర్వీర్యమైపోయాయి. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం–2 గ్రామ సచివాలయంలో ప్రస్తుతం వెల్ఫేర్ అసిస్టెంట్ పులకల ఉమాపతి ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. తల్లికి వందనం సమస్యలు, భూశిస్తులు, ఆధార్ సీడింగ్, కుల, నివాస ధ్రువ పత్రాల కోసం సోమవారం పదుల సంఖ్యలో లబ్ధిదారులు చేరుకోవడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయం చేసేందుకు మరో ఉద్యోగి లేక సాయంత్రం వరకు ఆకలితో అలమటిస్తూ విధులు నిర్వహించారు. ఇక్కడ మరో ఇద్దరు సిబ్బంది ఉండేవారు. వారిలో ఒకరు డీఎస్సీ పరీక్ష కోసం సెలవు పెట్టగా, మరొకరు బూర్జపాడులో ఇన్‌చార్జి విధులు నిర్వర్తిస్తున్నారు. –ఇచ్ఛాపురం రూరల్

తల్లికి వేదన



విద్యుత్ కార్యాలయం వద్ద బాధితులు

- 'తల్లికి వందనం' పథకం అందక పాట్లు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ఇచ్ఛాపురం రూరల్: ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తానంటూ గత ఎన్నికల ముందు ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. తీరా గద్దెనెక్కిన తర్వాత తొలి ఏడాది ఎగ్గొట్టారు. రెండో ఏడాది ప్రారంభమయ్యాక తొలిసారి అమల్లోకి తెచ్చిన తల్లికి వందనాన్ని నిబంధనల చట్రంలో ఇరికించారు. ఆచరణలోకి వచ్చేసరికి కొర్రీలతో కోతలు పెట్టారు. 300 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తే అనర్హత వేటు వేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 300 యూనిట్లు కంటే తక్కువ ఉన్నప్పటికీ గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించిన తల్లికి వందనం జాబితాలో అనర్హత ఉండటంతో లబోదిబోమంటున్నారు. తమకు తక్కువ బిల్లు వచ్చినప్పటికీ తల్లికి వందనం పథకంలో తమ పిల్లల పేర్లు అనర్హతగా నమోదయ్యాయని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అటు గ్రామ సచివాలయాలు, ఇటు విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ముగ్గురి పేర్లూ లేవు..



మాకు ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయి ఇంటర్, రెండో అమ్మాయి పది, బాబు ఆరో తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం జాబితాలో ముగ్గురి పేర్లు లేవు. ఈ నెల కరెంట్ బిల్లు 173 యూనిట్లకు రూ.1064.96 బిల్లు వచ్చింది. కానీ 300 యూనిట్లు దాటిందని, అందుకే మీ పిల్లల పేర్లు లిస్ట్‌లో లేవంటున్నారు. రెండు రోజుల నుంచి విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. ఏఈని అడిగితే సరిచేస్తామంటున్నారు. – పాండవ జ్యోత్స్న, ఎం.తోటూరు, ఇచ్ఛాపురం మండలం

బిల్లు ఎక్కువంటూ ఆపేశారు



మేము కంద్ర కులస్తులం. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు మావి. ఇటీవల మా ఆయన మృతి చెందారు. అబ్బాయి ఆరవ తరగతి, అమ్మాయి ఐదో తరగతి చదువుతున్నారు. ఇప్పుడు పైక్లాసులకు వెళ్తున్నారు. తల్లికి వందనం జాబితాలో ఇద్దరి పిల్లలు పేర్లు లేవు. 300 యూనిట్లు కరెంట్ వాడటం వల్ల అనర్హులుగా ప్రకటించారు. ఈ నెల 55 యూనిట్లు వాడితే రూ.600 బిల్లు వచ్చింది. ఏఈకి చెబితే దరఖాస్తు చేయండంటున్నారు. ఇప్పటికే రెండుమూడు సార్లు విద్యుత్ కార్యాలయానికి వెళ్లాం. – రేవతి బెహరా, ఇచ్ఛాపురం

దిగజారుడు రాజకీయాలెందుకు..

- అభివృద్ధి, అవినీతిపై చర్చకు సిద్ధం
- ఎమ్మెల్యే శిరీషకు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సవాల్



మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చేపడుతున్న అభివృద్ధి, అవినీతిపై డిబేట్ పెడితే అందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్పష్టం చేశారు. పలాసలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గౌతు లచ్చన్న మనవరాలిగా, మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ కుమార్తెగా శిరీష దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యేలపై చేసిన సర్వేలో ఆ పార్టీలో ఉన్న 72 మంది ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉన్నట్లు తేలిందని, అందులో పలాస ఎమ్మెల్యే శిరీష ఒకరని ఉదహరించారు. పలాస నియోజకవర్గంలో ప్రతి లిక్కర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గతంలో పలాస అల్లుడు టాక్స్ అని విమర్శించారని, మళ్లీ అదే తంతు జరుగుతోందని చెప్పారు. ఎమ్మెల్యే సహకారం లేకపోతే ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే శిరీష పద్ధతిగా రాజకీయాలు చేయడం నేర్చుకోవాలని హితవుపలికారు. 40 ఏళ్లుగా పలాస నియోజకవర్గానికి మీరు చేసిన అభివృద్ధి ఏంటో.. వైఎస్సార్ సీపీ పాలనలో ఐదేళ్ల పాటు మంత్రిగా తాను చేసిన అభివృద్ధి ఏంటో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

పొందూరులో ట్రాఫిక్ ఆంక్షలు

పొందూరు: పొందూరులో మంగళవారం ఉదయం 10 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి వస్తాయని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పొందూరు గ్రామంలోకి వాహనాల రాకపోకలు నిషేధించామని చెప్పారు. డీఎస్పీలు, సీఐలతో పాటు పోలీసు సిబ్బంది, స్పెషల్ ఫోర్సు సిబ్బందితో కలిపి మొత్తం 150 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. చిలకపాలెం రహదారి నుంచి పొందూరుకు వచ్చే వారంతా కృష్ణాపురం, తాపీమేస్త్రీ కాలనీ, ఎరుకులపేట, ఎరుకుల కాలనీ వద్ద.. రాజాం వైపు నుంచి వచ్చే వారు వాండ్రంగి కూడలి, జి.సిగడాం, బొట్లపేట వద్ద.. తండ్యాం నుంచి వచ్చే వారు జోగన్నపేట, లక్ష్మీపేట వద్ద వాహనాలు నిలుపుదల చేయాలని సూచించారు. పొందూరు గ్రామస్తులు పోలీసుస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు



ఉవ్వపేట ప్రాథమిక పాఠశాలకు గ్రామస్తులు తాళం వేశారు. ఇక్కడి 3, 4, 5 తరగతుల విద్యార్థులను 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న నీలంపేట మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 3,4,5 తరగతులను ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. – బూర్జ

పైడితల్లమ్మ

పండగ వెలుగులు

పొందూరులో పైడితల్లి అమ్మవారి పండగలు ఘనంగా జరుగుతున్నాయి. 30 రోజుల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మంగళవారం అమ్మవారి ఆలయం నుంచి శ్రీశయనవాడ వరకు సిరిమానోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దుర్గాదేవి, సీతారాములు తదితరుల రూపాలతో విద్యుద్దీపాలు అలంకరించారు. బుధవారం అనుపోత్సవం జరగనుంది. – పొందూరు



పొందూరులో పండగ కళ



ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారి లైటింగ్



త్రిమూర్తుల అలంకరణ

క్లుప్తంగా

నీలమణిదుర్గకు హైకోర్టు జడ్జి పూజలు



జడ్జి తుషార్‌రావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న సిబ్బంది

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణీ దుర్గ అమ్మవారిని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి గేదెల తుషార్‌రావు సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అశీర్వాదాలు అందజేశారు. ముందుగా ఆలయ మర్యాదలతో ఆలయంలోకి పూర్ణకుంభంతో ఆహ్వానించారు. ఆలయ సిబ్బంది అమ్మవారి చిత్రపటాన్ని జడ్జికి అందజేశారు. ఆయనతో పాటు పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి, ఎస్‌ఐ బి.లావణ్య, ఆలయ గుమస్తా కె.సుదర్శన రావు, అర్చకులు టి.సతీష్, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: మండలంలోని తిర్లంగా గ్రామానికి చెందిన పొందర కోదండ రావు(36)అనే తాపీమేస్త్రీ పురుగుల మందు తాగి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మృతుడు గత కొంతకాలంగా మూలవ్యాధితో బాధపడుతున్నాడు. అయితే ఆదివారం ఆ బాధ మరింత ఎక్కువ కావడంతో తట్టుకోలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



జగదీష్ మృతదేహం వద్ద రోదిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

సోంపేట: ఇచ్ఛాపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించిన పొట్టి జగదీష్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో పూర్తయ్యాయి. మండలంలో ఎర్రముక్కాం గ్రామంలోని శ్మశానవాటికలో అశ్రునయనాలతో సోమవారం పూర్తి చేశారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సోంపేట సీఐ బి.మంగరాజు, ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగదీష్ మరణం పోలీసు డిపార్ట్‌మెంట్‌కు తీరని లోటన్నారు. ఆయన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. జగదీష్ కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు జగదీష్ పాడెమోసి తన అభిమానాన్ని చాటుకున్నారు. అంతిమయాత్రలో గ్రామంలోని యువత, మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి కల్పన



హోటల్ మేనేజ్‌మెంట్‌లో సర్వ్ ఎలా చేయాలో నేర్పిస్తున్న దృశ్యం

- మహిళల ఉపాధికి ఊతం
- ఎచ్చెర్ల మహిళా ప్రాంగణంలో తర్ఫీదు
- ప్రస్తుతం హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ
- కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సైతం అవగాహన

ఎచ్చెర్ల: మండల కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నిరుద్యోగ మహిళా యువతకు వివిధ ఉపాధి రంగాల్లో శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రవేశపెట్టిన డీడీయూజీకేవై పథకం ద్వారా డొమైన్ (హోటల్ మేనేజ్‌మెంట్) రంగంలో శిక్షణ ఇస్తూ, అనంతరం మెరుగైన ఉపాధి అందిస్తున్నారు. ఆ ట్రేడ్‌కు సంబంధించిన శిక్షణ మాత్రమే కాకుండా, పలు నైపుణ్యాలను అందిస్తున్నారు. శిక్షణలో కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్‌పై అవగాహన, ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం కల్పిస్తున్నారు. హోటల్ మేనేజ్‌మెంట్ రంగానికి మంచి డిమాండ్ ఉండడంతో శిక్షణ పూర్తి చేసిన వెంటనే ఉపాధి లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. పదో తరగతి చదువుకుని 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు వారిని ఈ శిక్షణలో చేర్పించుకుంటున్నారు.

బ్యాచ్‌లుగా శిక్షణ

ఇక్కడ మూడు బ్యాచ్‌లుగా విడదీసి శిక్షణ ఇస్తున్నారు. మొత్తం బ్యాచ్‌కు 30 మంది చొప్పున 90 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం 72 మంది ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఎలా విధులు నిర్వర్తించాలి, ఎలా మెలగి ఉండాలనే విషయాలను ప్రాక్టికల్‌గా చేయించి చూపిస్తున్నారు. అంతేకాకుండా కంప్యూటర్ ల్యాబ్‌లో కంప్యూటర్ ఆపరేటింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ వంటివి నేర్పిస్తున్నారు. ఈ శిక్షణలో మూడు నెలలు పాటు భోజనం, వసతి కల్పిస్తున్నారు. ఈ సమయంలో 15 రోజుల పాటు క్షేత్ర స్థాయిలో ఆయా రంగాలకు సంబంధించి రెస్టారెంట్లకు తీసుకెళ్లి ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తున్నారు. అనంతరం శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల్లో పలు రెస్టారెంట్లలో, కంప్యూటర్ రంగాల్లో ఉపాధి కల్పిస్తున్నారు.

అద్భుతమైన అవకాశం

పై చదువులు చదువుకోలేని వారికి ఈ శిక్షణ అద్భుతమైన అవకాశంగా మారింది. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ వరకూ చదువుకుని, ఇంటివద్ద పరిస్థితులు బాగాలేని నిరుపేదలకు ఈ శిక్షణలు తోడుగా ఉంటున్నాయని పలువురు చెబుతున్నారు. ఈ శిక్షణలో చేరడానికి 18 సంవత్సరాలు నిండి పదో తరగతి వరకు చదువుకున్న మహిళలు అర్హులు కావడం వలన చదువు మధ్యలో ఆపివేసిన వారు ఎక్కువగా ఈ శిక్షణలో చేరుతున్నారు. ఉపాధితో ఆర్థికంగా ఇంటికి చేదోడుగా ఉండటానికి ఈ శిక్షణలు ఉపయోగకరంగా ఉన్నాయని చెబుతున్నారు.

శిక్షణ బాగుంది



ఇక్కడ ఉపాధి కోసం శిక్షణలో చేరాను. సంబంధిత శిక్షణతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. డిగ్రీ వరకు చదువుకున్నాను. ఉపాధితో పాటు ఈ శిక్షణ చాలా రకాలుగా మాకు ఉపయోగపడుతోంది. శిక్షణ అనంతరం ఉపాధికి వెళ్లి కుటుంబానికి తోడుగా నిలవాలన్నదే నా కోరిక.

– బి.సౌజన్య, లింగాలపేట, ఎచ్చెర్ల మండలం

సౌకర్యాలతో కూడిన శిక్షణ



ఇక్కడ విద్యార్థులకు అన్నివిధాలుగా సౌకర్యాలతో కూడిన శిక్షణ అందిస్తున్నాము. ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో పాటు కంప్యూటర్ ల్యాబ్‌లతో కూడిన శిక్షణ అందించడం జరుగుతోంది. శిక్షణ అనంతరం వివిధ కంపెనీలు, పెద్దపెద్ద హోటళ్లలో ఉపాధి కల్పించడం జరుగుతుంది.

– దన్నాన సంతోష్, హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షకులు

ఉపాధి కోసం



ఉద్యోగం సంపాదించి ఇంటికి చేదోడుగా ఉండడానికి ఈ శిక్షణలో చేరాను. హోటల్ మేనేజ్‌మెంట్ రంగంలో శిక్షణ పొందుతున్నాను. ఇక్కడ హోటల్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఇంగ్లిష్, కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటర్మీడియట్ చదువుకున్నాను. పై చదువులు చదవలేక ఖాళీగా ఉన్న సమయంలో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారని తెలుసుకుని జాయిన్ అయ్యాను. శిక్షణ అనంతరం ఉపాధి పొంది ఇంటికి నావంతు తోడుగా నిలుస్తాను.

– ఎ.జ్యోత్స్న, పెద్దరావుపల్లి, లావేరు మండలం

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రేగులపాడు ఆఫ్‌షోర్ నిర్వాసితులు

- రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సింహాచలం


మెళియాపుట్టి: రేగులపాడు ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు గంగారపు సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చీపురుపల్లి, దాసుపురం తదితర గ్రామాలకు చెందిన నిర్వాసితులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. అనంతరం డీటీ రాము, ఎంపీడీవో నరసింహప్రసాద్ పండాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ.. ప్రాజెక్టు కోసం ఇళ్లు, భూములు, గ్రామాలను సైతం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేసి, వారి న్యాయపరమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టి సారించాలని విన్నవించారు.

ఒకటే నిర్వాసిత కాలనీతో ఇబ్బందులు

నిర్వాసితులకు మొత్తం ఏడు నిర్వాసిత కాలనీలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ కేవలం ఒక్కటే నిర్మించారని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ప్రాజెక్టు ప్రారంభించి 16 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ నిర్వాసితులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రతీ ఏడాది పెరుగుతున్నా.. నిర్వాసితుల సమస్యలు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయని వాపోయారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం హిరమండలం వంశధార నిర్వాసితులకు ఇచ్చిన ప్రాప్తికి ప్యాకేజీలు అందించాలని, నేటికీ నిర్వాసితులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించలేదన్నారు. ఇప్పటికీ కూడా ప్రాజెక్ట్ పరిధిలో 132 మందికి ప్యాకేజీలు పెండింగ్ ఉన్నాయన్నారు. పునరావాస కాలనీల్లో రహదారులు, వీధి దీపాలు, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యవ్వారి ఈశ్వరరావు, దొర విజయ్ కుమార్, కిరణ్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను మోసం చేశారు

- వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ కంటే మిన్నగా అన్ని రకాల పథకాలు ఇస్తామని, అభివృద్ధి చేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు, అధికారం చేతికొచ్చాక రాష్ట్ర ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ అన్నారు. కూటమి పాలన వైఫల్యాలపై సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తుండడం దారుణమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పాలన అందించారన్నారు. కానీ చంద్రబాబుకు మాత్రం తెలుగు తమ్ముళ్లు, పెత్తందారుల అభివృద్ధే ముఖ్యమన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనా నేటికీ అన్నదాత సుఖీభవ డబ్బులు వేయకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంకా విత్తనాలు పంపిణీ చేయకపోవడం అన్యాయమన్నారు. కూటమి పాలనలో అక్రమాలను ప్రజలంతా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో సమాధానం చెప్తారని పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- పాలవలసలో కలవరపెడుతున్న వరుస హత్యలు..?



గోకర్ల రాజేశ్వరి(ఫైల్)

సోంపేట/మందస: మందస మండలంలోని కొత్తపేట గ్రామ సముద్ర తీరంలో సోంపేట మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన గోకర్ల రాజేశ్వరి అనుమానాస్పద రీతిలో శవమై కనిపించింది. మందస పోలీసులు, రాజేశ్వరి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పాలవలస గ్రామానికి చెందిన రాజేశ్వరి ఈనెల 11వ తేదీన పాలవలస నుంచి కన్నవారి గ్రామం పిడిమందస వెళ్లింది. ఐదు నెలల పాపను పాలవలసలో విడిచిపెట్టి ఉండడంతో రాజేశ్వరి బంధువులు పిడిమందస నుంచి హరిపురం వరకు ద్విచక్ర వాహనంలో తీసుకొచ్చి, మరలా పాలవలస చేరుకోవడానికి హరిపురంలో రాజేశ్వరిని బస్సు ఎక్కించారు. అయితే రాత్రి అవుతున్నా రాజేశ్వరి పాలవలస చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పిడిమందస ఫోన్‌చేసి సమాచారం కనుక్కున్నారు. రాజేశ్వరి ఇంటికి చేరుకోలేదనే విషయం తెలియడంతో ఇరు కుటుంబాల సభ్యులు ఆందోళన చెందారు. హరిపురం నుంచి పాలవలస మధ్య గ్రామాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో మందస పోలీసుస్టేషన్‌లో వివాహిత అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు



రాజేశ్వరి మృతదేహం

ఇదీ విషయం...

మందస మండలంలోని కొత్తపేట గ్రామ సముద్ర తీరంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఆదివారం రాత్రి స్థానికుల కంటబడింది. సగం కాలిన స్థితిలో మృతదేహం ఉండడంతో స్థానికులు ఆందోళనతో మందస పోలీసులకు సమాచారం అందించారు. మందస పోలీసు స్టేషన్ పరిధిలో అప్పటికే మహిళ మిస్సింగ్ కేసు నమోదై ఉండడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. అయితే మహిళ మృతదేహం పాలవలస గ్రామానికి చెందిన రాజేశ్వరిదిగా సోమవారం ఉదయం నిర్ధారించారు. పిడిమందస గ్రామానికి చెందిన రాజేశ్వరికి పాలవలస గ్రామానికి చెందిన గోకర్ల చంద్రశేఖర్‌తో ఐదు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. చంద్రశేఖర్ ఉపాధి నిమిత్తం విదేశాల్లో విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి మూడు సంవత్సరాలు, ఐదు నెలలు వయసు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే రాజేశ్వరి మృతికి గల కారణాలు తెలియడం లేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో హత్యచేసి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. రాజేశ్వరి మృతి చెందిందని తెలియడంతో పాలవలస, పిడిమందస గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సోంపేట సీఐ బి.మంగరాజు, కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, మందస ఎస్‌ఐ కె.కృష్ణ, శ్రీకాకుళం క్లూస్ టీమ్ సభ్యులు పరిశీలించారు.

పాలవలసలో ఏం జరుగుతోంది..

సోంపేట మండలంలోని పాలవలస గ్రామంలో అలజడి నెలకొంది. గ్రామంలో వరుస హత్యలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత నెల 18వ తేదీన అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్న సమయంలో గ్రామానికి చెందిన గోకర్ల ఈశ్వరరావును గుర్తు తెలియని వ్యక్తులు సమీప జీడితోటల్లో హత్య చేశారు. కాగా ఇప్పటికీ హత్యకు గల కారణాలు, దోషులు తెలియలేదు. ఈ ఘటన మరువకముందే ఈశ్వరరావు ఇంటికి ఎదురుగా ఉన్న గోకర్ల రాజేశ్వరి(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వార్త గ్రామంలో కలకలం సృష్టించింది.

విన్నపాలు వినవలె..!

- పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ
- అర్జీదారుల నుంచి 114 వినతుల స్వీకరణ



పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శ్రీకాకుళంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈవో ఎల్.ఎస్.వి.శ్రీధర్ రాజా నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై మొత్తం 114 వినతులు అందజేశారు. వీటిలో భూమి సమస్యలు, పింఛన్లు, నివాస స్థలాలు, రేషన్ కార్డులు, మౌలిక వసతులపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అప్పగిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు సూచించారు. ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాల విలీనం ఆపాలి



పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న ధర్మవరం ప్రజలు

ఎచ్చెర్ల మండలంలో ధర్మవరం బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విలీనం వెంటనే నిలుపుదల చేయాలని ఆ గ్రామానికి చెందిన పలువురు పీజీఆర్‌ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆమోదం లేకుండా, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించకుండా అడ్డదారిలో పాఠశాలను ఎత్తివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో అల్లు కన్నబాబు, చల్ల పద్మ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ ప్రారంభించండి

శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయిన పీహెచ్‌సీని వెంటనే ప్రారంభించి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సేవలందించాలని కళ్లేపల్లి, సమీప ప్రాంతాల ప్రజలు, నాయకులు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కళ్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలో కిల్లిపాలెం, కనుగులవానిపేట, ఇప్పిలి, గనగళ్లవానిపేట, కుందువానిపేట, బలరాంపురం, సానివాడ, ఒప్పంగి తదితర గ్రామాలు ఉన్నాయని తెలిపారు. తాత్కాలిక భవనంలో సదుపాయాలు లేకపోవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారని వెల్లడించారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ మొకాళ్ల శ్రీధర్, ఎంపీటీసీ చిట్టి జనార్దన్‌రావు, మొకాళ్ల తాతబాబు, గంగు నరేంద్ర, కనుగుల అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ పుక్కల శ్రీరాములు, సర్పంచ్‌లు వారాధి ఆదినారాయణ, సూరాడ సూర్యం, లోలుగు శ్రీనివాసరావు, గంగు నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కరించండి



మురుగునీటి సమస్యపై ఫిర్యాదు చేస్తున్న కృష్ణమూర్తి

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 1వ వార్డు పాత్రునివలస హైటెక్ పారడైజ్ నివాసాల మురుగునీటి సమస్య పరిష్కరించాలని హైటెక్ పారడైజ్ అపార్టుమెంట్ ప్రతినిధి వి.కృష్ణమూర్తి పీజీఆర్‌ఎస్‌లో కోరారు. ఇదే విషయమై మే 26న ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలియజేశారు. శ్రీకాకుళం పట్టణ నడిబొడ్డున గేటెడ్ కమ్యూనిటీ పేరున కొన్ని సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఈ అపార్టుమెంట్‌లో ఇప్పటికీ మురుగు నీటి పారుదల వ్యవస్థ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదని వివరించారు. దీనివల్ల ఇక్కడ ఉన్న నాలుగు బ్లాకుల్లో (ఒకటి నిర్మాణంలో ఉంది) నివాసితులు వినియోగించే నీరు అపార్టుమెంట్ ఆవరణలోనే చేరుతోందని పేర్కొన్నారు. మురుగునీరు చేరడం వలన రోగాలు బారినపడే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 56 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 56 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో అదనపు ఎస్పీ (అడ్మిన్) కేవీ రమణ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వ్యక్తిగతంగా మాట్లాడి, సమస్యలు తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్స్ ద్వారా తక్షణమే తెలియజేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

- బంగారు, వెండి ఆభరణాల అపహరణ



సోదాలు నిర్వహిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని సౌభాగ్యలక్ష్మి కల్యాణ మండపం వెనుక సాయినగర్‌లో ఉన్న రెండు ఇళ్లల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. విశ్రాంత ఉపాధ్యాయుడు దుంగ రామారావుతో పాటు గనగళ్ల రాంబాబుకు చెందిన ఇళ్లల్లో చోరీ జరిగింది. ఈ రెండు ఇళ్లకు చెందినవారు విశాఖలో ఉంటున్నారు. డోర్‌లాక్ చేసిన విషయాన్ని గమనించి దొంగలు చోరీకి పాల్పడ్డారు. చోరీ జరిగి రెండు మూడు రోజులు అయినట్లుగా తెలుస్తోంది. సోమవారం ఉదయం స్థానికులు అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌ఐ దుర్గాప్రసాద్ పరిశీలించి ఇంటి యజమానులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చిన తర్వాత క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఈ చోరీలో తమ ఇంట్లోని మూడు తులాల బంగారు ఆభరణాలు, 44 తులాల వెండి వస్తువులు, రూ.35 వేల నగదు అపహరణకు గురైందని దుంగ రామారావు తెలిపారు. అలాగే కేజీన్నర వెండి వస్తువులు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గనగళ్ల రాంబాబు తెలిపారు. ఈ మేరకు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. చోరీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడు మృతి

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి పెద్దకోట నాగేశ్వరరావు(56) అనే వృద్ధుడు మృతి చెందినట్లు సోమవారం జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుడిది కోటబొమ్మాళి మండలంలోని పెద్ద బమ్మిడి గ్రామం. విశాఖపట్నం నుంచి రైలులో స్వగ్రామం వస్తుండగా పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడినట్లు పేర్కొన్నారు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలంలోని హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అనంతరం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి వయస్సు 45 సంవత్సరాలు ఉండవచ్చునని, నీలం రంగు టీషర్టు, ఆకుపచ్చ రంగు లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. అతనిపై ఉన్న గాయాలు ఆధారంగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు ఎవరికైనా తెలిసిస్తే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ షరీఫ్ కోరారు.